తాటితూరు పాఠశాలకు బల్లలు, కుర్చీల వితరణ

విశాలాంధ్ర - తగరపువలస: తాటితూరు పాఠశాలలో చదువుకున్న పూర్వపు విద్యార్థులు 2003-2004 బ్యాచ్‌కి చెందిన పదవ తరగతి విద్యార్థులు పాఠశాలకి సైన్స్ ల్యాబ్ కోసం బల్లలు, కుర్చీలు అందించారు. సుమారు పదివేల రూపాయల సామాన్లను అందించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి.శ్రీనివాసరావు తెలియజేశారు. అందించిన వారిలో తమ్మిన సురేష్, పల్లా శ్రీను, సింగవరపు వెంకటరమణ, తిప్పల రమేష్, టి.కనక రత్నం, పి.రమాదేవి, సిహెచ్.అప్పలరాజు, కే.కుమారి ఉన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు టీ.ఎస్.వి. ప్రసాదరావు, అప్పలనాయుడు, వి.శ్రీనివాసరావు, ఎం.గణేష్, చంద్రశేఖర్, పైడ్రాజు తదితరులు పాల్గొన్నారు.

మసాజ్‌ల పేరుతో మాయాజాలం

నిబంధనలకు విరుద్ధంగా నగరంలో స్పా, మసాజ్ కేంద్రాల నిర్వహణ
పోలీసులు తనిఖీల్లో వెల్లడైన నిజాలు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: విశాఖ నగరంలో విదేశీ మసాజ్‌ల పేరిట మాయాజాలంతో లక్షలాది రూపాయలు దోచేస్తున్నారు. నగరంలో అడుగడుగునా విస్తరిస్తున్న స్పా, మసాజ్ కేంద్రాలపై కొంతమంది పెద్దల అండదండలతోనే అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని పెద్ద ఎత్తున ఫిర్యాదులు అందుతున్న నేపథ్యంలో నగర పోలీసు కమిషనర్ డా.శంఖబ్రత బాగ్చి ఆదేశాలతో నగర పరిధిలో గల స్పా, మసాజ్ కేంద్రాలలో మాదక ద్రవ్యాలు, అక్రమ కార్యకలాపాలు, అక్రమ రవాణా, ఇతర అసాంఘిక చర్యలను విశాఖ నగరంలో పూర్తిగా నిర్వీర్యం చేయుటకు ప్రత్యేక చర్యల్లో భాగంగా సోమవారం రాత్రి ఆకస్మికంగా స్పా, మసాజ్ కేంద్రాలపై విస్తృత తనిఖీలు జరిపారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణలో రాత్రి 07:45 నుండి 10 గంటల మధ్య చేపట్టిన ఈ తనిఖీలలో నగర వ్యాప్తంగా జోన్ -01, జోన్-02 కలిపి ఉన్న మొత్తం 83 స్పా మసాజ్ కేంద్రాలలో 31 స్పా, మసాజ్ కేంద్రాలు తెరచి ఉండగా, మిగిలిన 52 స్పా, మసాజ్ కేంద్రాలు మూసి ఉన్నట్లు తెలిసింది. ప్రధానంగా స్పా, మసాజ్ కేంద్రాలలో వ్యభిచారం నిర్వహణ, లేబర్ లైసెన్స్, ఫైర్ ఎన్‌ఓసీ, ట్రేడ్ లైసెన్స్, జీఎస్‌టీ, గదులకు తలుపులు, గడియలు ఉన్నదీ, లేనిదీ, ఇతర రాష్ట్ర లేదా దేశ సిబ్బంది పనిచేస్తున్నది, లేనిదీ, సందర్శకుల రికార్డులు నిర్వహిస్తున్నది, లేనిదీ, సీసీటీవీ కెమెరాలు ఉన్నవీ లేనివీ, సీసీ టీవీ కెమెరాల డేటా ఫుటేజ్ 15 నుండి 30 రోజులు భద్రపరుస్తున్నది, లేనిదీ పోలీసులు తనిఖీ చేశారు. సుమారు 200 మంది సిబ్బందితో నగరంలో గల స్పా, మసాజ్ కేంద్రాలను ఏకకాలంలో విస్తృత తనిఖీలు జరిపిన నగర పోలీసులు కొన్ని స్పా మసాజ్ కేంద్రాలలో ఉల్లంఘనలను గుర్తించారు. 2 స్పా మసాజ్ కేంద్రాలకు లేబర్ సర్టిఫికెట్ లేదని, 25 స్పా మసాజ్ కేంద్రాలకు ఫైర్ ఎన్‌ఓసీ లేదని, 10 స్పా మసాజ్ కేంద్రాలకు ట్రేడ్ లైసెన్స్ లేదని, 18 స్పా మసాజ్ కేంద్రాలకు జీఎస్‌టీ లేదని గుర్తించారు. 1 స్పా, మసాజ్ కేంద్రమునకు సీసీటీవీ కెమెరాలు లేవని, 2 స్పా మసాజ్ కేంద్రాలకు సీసీ టీవీ కెమెరాల ఫుటేజ్ లేదన్నారు. 1 స్పా, మసాజ్ కేంద్రంలో నలుగురు విదేశీ సిబ్బందిని గుర్తించారు. 01 స్పా, మసాజ్ కేంద్రంలో పశ్చిమ బెంగాల్ సిబ్బందిని గుర్తించారు. 3 స్పా, మసాజ్ కేంద్రాలకు తలుపులు గడియలు ఉన్నట్లు గుర్తించారు. జీవీఎంసీ అధికారులు జారీ చేసే ట్రేడ్ లైసెన్స్ చాలా మంది గడువు ముగిసి ఉన్నవారిపై, ఎంతమంది పనిచేస్తున్నారో తెలుపుతూ ఇచ్చే లేబర్ సర్టిఫికెట్ ఉంటూ, పరిమితికి మించి పనివారు గల మసాజ్ కేంద్రాలపై, జి.ఎస్.టి సర్టిఫికెట్ లేకుండా స్పా కేంద్రాలను నిర్వహిస్తూ టాక్స్‌ను కట్టకుండా వ్యాపారం చేస్తున్న వారిపై, అదే విధముగా స్పష్టమైన నిబంధనలను పాటించని స్పా మసాజ్ కేంద్రాలను గుర్తించి, నోటీసులు ఇవ్వడంతో పాటుగా ఆయా శాఖల సంబంధిత అధికారులకు సదరు నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న స్పా మసాజ్ కేంద్రాలపై తదుపరి చర్యలు నిమిత్తం పోలీసులు నివేదికను సిద్ధం చేశారు. స్పా, మసాజ్ కేంద్రాల్లో నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా వ్యవహరించినా లేదా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని సీపీ తెలిపారు. ప్రజలు అందరూ తాను ఇచ్చిన 7995095799 నంబరును సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఘనంగా క్రిష్ణమయ్య జయంతి ఉత్సవాలు

విశాలాంధ్ర-సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి వారి బేడా మండపంలో సంకీర్తనాచార్యులు శ్రీకాంత కృష్ణయ్య జయంతి ఉత్సవం ఘనంగా జరిగింది. గత నెల 29న ప్రారంభం అయిన కృష్ణయ్య ఉత్సవాలు మంగళవారం ముగిశాయి. అర్చక స్వాములు కృష్ణామయ్య విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు, సంకీర్తనలు ఆలపించారు. సాయంత్రం సుమారు 100 మంది నృత్య విద్యార్థినులతో ఆలయం రాజగోపురం వద్ద శ్రీ నిర్మల నృత్య నికేతన్ వారి "కృష్ణమయ్య కీర్తనం, కూచిపూడి నర్తనం" ప్రదర్శన జరిగింది. పిదప నృత్యనికేతన్ సారథి నిర్మల, విద్యార్థులకు మెమోంటోలు దేవస్థానం వారు అందజేశారు.

రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా కోమలి

విశాలాంధ్ర-గోపాలపట్నం: గ్రేటర్ విశాఖ గోపాలపట్నం తహశీల్దార్ కార్యాలయం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్‌ఐ)గా కే.కోమలి బాధ్యతలు చేపట్టారు. ఈ మేరకు ఇక్కడ పని చేసిన రెవెన్యూ ఇన్స్పెక్టర్ డి.సురేష్ కుమార్ అనకాపల్లి బదిలీపై వెళ్లారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కోమలి గతంలో కలెక్టరేట్ డిఎస్‌ఓ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహించారు. అనంతరం అక్కడి నుంచి సర్కిల్ -1 సివిల్ సప్లై కార్యాలయానికి బదిలీపై వచ్చారు. మర్రిపాలెం పరిధిలో సీనియర్ చెకింగ్ ఆఫీసర్ గా విధులు నిర్వహిస్తున్న ఆమే సాధారణ బదిలీలో భాగంగా గోపాలపట్నం తాహసిల్దార్ కార్యాలయానికి ఆర్‌ఐగా వచ్చారు. ఈ సందర్భంగా గోపాలపట్నం తహశీల్దార్ సిహెచ్‌వి.రమేష్, డిప్యూటీ తహశీల్దార్ సువర్ణ బాయ్ వీఆర్వోలు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అందరి సహకారంతో దరఖాస్తు దారులకు మెరుగైన సేవలందించేందుకు కృషి చేస్తానన్నారు.

జిప్సా నూతన కమిటీకి అభినందన

విశాలాంధ్ర - పెదగంట్యాడ: గాజువాక ప్రైవేట్ పాఠశాలల సంక్షేమ సంఘం (జిప్సా)కు ఇటీవల నూతనంగా ఎన్నుకోబడిన గౌరవాధ్యక్షులు పి.భాస్కరరావు, సెక్రటరీ, ట్రెజరర్‌లు బి. శ్రీనివాసరావు, యస్.షణ్ముఖరావు, యమ్.బాబురావులు గాజువాక మండల విద్యా శాఖాధికారులు యమ్.సునీత, బి.విశ్వనాధంలను వారి కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. నూతన కమిటీ సభ్యులను ఎంఈఓలు అభినందించారు. ఈ సందర్భంగా ప్రైవేట్ పాఠశాలల పలు సమస్యలపై చర్చించారు. పాఠశాలల గుర్తింపు రెన్యువల్, పని దినాలు, సెలవులు, పరీక్షలు మొదలగు అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో జిప్సా ఉపాధ్యక్షుడు యమ్.సత్యన్నారాయణ, సభ్యులు డి.ప్రసాదరావు, రాజా తదితరులున్నారు.

జోన్-2 కమిషనర్‌ను కలిసిన జనసేన నేతలు

విశాలాంధ్ర - మధురవాడ: మధురవాడ జోన్-2 కమిషనర్ సింహాచలంను 5వ వార్డు జనసేన అధ్యక్షులు దేవర శివ ఆధ్వర్యంలో మంగళవారం ఆ వార్డు జనసేన కమిటీ సభ్యులు మర్యాపూర్వకంగా కలిసారు. శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా వార్డులో ఉన్న సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించాలని కోరారు. ముఖ్యంగా డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపర్చి కాలనీలో వీధులను శుభ్రంగా ఉంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు దారపు సూరిబాబు, శ్రీను, జనరల్ సెక్రటరీ ఈశ్వరరావు, సతీష్, సెక్రటరీ బొట్ట శ్రీనివాస్, వెంకటేష్, ధర్మారావు, నరేష్, అయ్యప్పస్వామి, అనిల్, బత్తిన శివ, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

27 మంది మహిళా సంఘాల నాయకులపై కేసు కొట్టివేత

2017లో అందాల పోటీలను వ్యతిరేకిస్తూ ఆందోళన చేసిన నాయకులు

విశాలాంధ్ర - విశాఖ: విశాఖ మేఘాలయ హోటల్‌లో 2017లో నిర్వహించిన అందాల పోటీలను వ్యతిరేకిస్తూ ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య, ఐద్వా, పీఓడబ్ల్యు, సిఎంఎస్ ప్రజా సంఘాలకు చెందిన 27 మంది మహిళలపై పోలీసులు అక్రమంగా పెట్టిన కేసు నెంబరు 434/2018 మూడవ అదనపు సివిల్ న్యాయమూర్తి జి.కార్తీక్ మంగళవారం కొట్టివేశారు. ఈ సందర్భంగా ఈ సంఘాల నాయకులు మాట్లాడుతూ ప్రజా పోరాటాలు వర్ధిల్లాలని, మహిళలను అసభ్యకరంగా చూపించిందాన్ని ఖండించినందుకు ప్రభుత్వం మాపై కేసు పెట్టిందిగానీ అందాల పోటీలను ఆపలేక పోయిందని, ఇది మహిళా లోకాన్ని అవమానించడ మేనని పేర్కొంటూ ప్రభుత్వాలు మహిళా అభ్యుదయానికి పాటుపడాలని కోరారు. తమ తరుపున న్యాయం కోసం కృషి చేసిన న్యాయవాదులకు కృతజ్ఞతలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు అత్తిలి విమల, ఎండి బేగం, బి.పరమేశ్వరి, సీహెచ్ నూకాలమ్మ, ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు బి.ప్రభావతి, ప్రగతి శీల మహిళా సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి ఎం.లక్ష్మి, సిఎంఎస్ డి లలిత తదితరులతో మొత్తం 27 మంది మహిళలపై పెట్టిన అక్రమ కేసు కొట్టివేశారు.

విలువలతోనే వైద్య వృత్తిలో రాణింపు

విశాలాంధ్ర - మధురవాడ: వైద్య వృత్తిలో రాణించాలంటే అంకితభావంతో పాటు సామాజిక బాధ్యతతో ఎదగాలని స్వీయ ప్రతిభను పెంచుకోవాలని కృత్రిమ మేధ వంటి సాంకేతికను ఉపయోగించుకోవాలని గీతం అధ్యక్షుడు, పార్లమెంట్ సభ్యుడు ఎమ్.శ్రీభరత్ పేర్కొన్నారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంకు అనుబంధంగా గల గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చి (జిమ్‌సర్) వైద్య కళాశాలలో 2024 బ్యాచ్ నూతన ఎంబిబిఎస్ విద్యార్థులకు నిర్వహించిన "వైట్‌కోట్ ధారణ" కార్యక్రమంలో మంగళవారం ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. వైద్యరంగంలోకి సాంకేతిక పరిజ్ఞానం రానున్న రోజులలో కీలక భూమిక వహించనున్నదని అయితే వృత్తి నైపుణ్యం, మానవ సంబంధాలు, రోగ లక్షణాలను విశ్లేషించి రోగికి మానసికంగా ధైర్యం చెబుతూ వైద్యులు అందించే చికిత్సకు ప్రత్యామ్నాయం లేదన్నారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు డాక్టర్ ఎమ్.జయచంద్రనాయుడు మాట్లాడుతూ వైద్య వృత్తిలోకి ప్రవేశించే వారు నిరంతర విద్యార్థిగా ఉండాలని, విలువలకు ప్రాధాన్యత ఇవ్వాలని, రోగుల పట్ల బాధ్యతగా వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఇన్‌ఛార్జి వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు, జిమ్‌సర్ ప్రో వైస్ ఛాన్సలర్ డాక్టర్ బి.గీతాంజలి, జిమ్‌సర్ వైద్య కళాశాల డీన్ డాక్టర్ ఎస్.పి.రావు, గీతం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వసంతకుమార్ తదితరులు పాల్గొన్నారు.

75వ వార్డులో పెన్షన్లు పంపిణీ

విశాలాంధ్ర - పెదగంట్యాడ: 75వ వార్డు నెల్లిముక్కు దొమ్మటి వీధిలో పెన్షన్ల పంపిణీ జరిగింది. 75వ వార్డు కార్పొరేటర్ పులి ఝాన్సీ లక్ష్మీబాయి, పులి వెంకటరమణారెడ్డి, యువ నాయకులు బాబి చేతుల మీదుగా పెన్షన్లు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు ములకలపల్లి పెంటయ్య, మొల్లి అప్పారావు, మొల్లి రమణ, పెద్దాడ సోమి నాయుడు, మద్దూర్తి సాంబశివరావు, బత్తిని పెంటయ్య, రాజు పాల్గొన్నారు.

విధుల నుంచి తొలగింపు సరైంది కాదు
ఉక్కు ఈడి (వర్క్స్) కార్యాలయం ముట్టడి

విశాలాంధ్ర - గాజువాక: విశాఖ ఉక్కు కర్మాగారంలో విధులు నిర్వహిస్తున్న 4 వేల మంది కాంట్రాక్టు కార్మికులను ఉక్కు యాజమాన్యం తొలగింపును వ్యతిరేకిస్తూ స్టీల్‌ప్లాంట్ ఎగ్జిక్యూటివ్ వర్క్స్ కార్యాలయాన్ని కాంట్రాక్ట్ కార్మికులు మంగళవారం ముట్టడించారు. వేలాది మంది కాంట్రాక్టు కార్మికులు రావడంతో ఈడి వర్క్స్ ప్రాంగణం కార్మికుల నినాదాలతో హోరెత్తింది. తమను ఉక్కు యాజమాన్యం ఏక పక్షంగా విధుల నుంచి తొలగించడాన్ని కార్మికులు తప్పు పడుతున్నారు. ఉక్కు యాజమాన్యం తక్షణమే స్పందించి విధులు నుంచి తొలగించిన కార్మికులను తీసుకోవాలని అఖిలపక్ష కార్మిక సంఘాల నేతలు డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ కార్మిక సంఘాల నేతలతో ఉక్కు యాజమాన్యం చర్చలు జరుపుతోంది.

మండలంలో కేంద్ర బృందం పర్యటన

విశాలాంధ్ర - ఆనందపురం: ఆనందపురం మండలంలో కేంద్ర బృందం పర్యటించిది. కనమాం, వెల్లంకి గ్రామంలో మంగళవారం కేంద్ర బృందం పర్యటించింది. ఈ సందర్భంగా కణమాం పంచాయతీలో రికార్డులు, ఎన్‌ఆర్‌జిఎస్ పనులను పరిశీలించారు. ఎన్‌ఆర్‌జిఎస్ ఉపాధి హామీ పనులు, చెరువు పూడికతీత పనులను సందర్శించారు. రైతులతో మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం వలన ఉపయోగాలు నగదు లావాదేవీల గురించి ఆరా తీశారు. వెల్లంకిలో జరిగిన కార్యక్రమంలో వెల్లంకి గ్రామం సాగి గ్రామంగా ఎంపికైన సందర్భంగా గ్రామంలో సిసి రోడ్లు, జల జీవన మిషన్, ఇంటింటి కొళాయిలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ టీమ్ సభ్యులు అనిల్ గైక్వాడ్, అనిల్ నింబోర్కర్, ఎంపీడీఓ డాక్టర్ వి.జానకి, ఈఓఆర్డీ ఏపీడీ కే.ఆంజనేయులు, డీఆర్డీఏ డిపిఎం వైదేహి, వెల్లింగ్ సర్పంచ్ ఉప్పాడ లక్ష్మణరావు, ఉప సర్పంచ్ కంచరాపు శ్రీను, నాయకులు చెన్నా నర్సింగరావు, పంచాయతీ కార్యదర్శులు శ్రీరామ్ మూర్తి, డీఆర్డీఏ అధికారులు పాల్గొన్నారు.

జిల్లాలో పెన్షన్ల పంపిణీ 97.39 శాతం పూర్తి

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: విశాఖపట్నం జిల్లాలో ఎన్.టి.ఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ అక్టోబర్ నెలకు సంబంధించి పెన్షన్ల పంపిణీ ఒకటవ తేదీ ఉదయం 6 గంటలకు మొదలుపెట్టారు. సాయంత్రం 6 గంటలకు పంపిణీ చేయగా 97.39 శాతం పూర్తి అయింది. లబ్ధిదారులందరికీ పెన్షన్లు వారి ఇంటివద్దనే పంపిణీ చేశారు. అక్టోబర్ నెలలో 2వ తేదీ (గాంధీ జయంతి) సెలవు దినం కావడంతో మిగిలిన లబ్ధిదారులకు 3వ తేదీన పెన్షన్ పంపిణీ జరుగుతుందని అధికారులు తెలిపారు. అక్టోబర్ మాసానికి సంబంధించి విశాఖపట్నం జిల్లాలో 1,62,490 మంది లబ్ధిదారులకు రూ.69,81,00,500లు పంపిణీ చేయవలసి ఉండగా వారిలో 1,58,244 మందికి రూ.67,96,43,000 లు పంపిణీ జరిగింది. గ్రామీణ మండలంలలో ఉన్న 26,948 మంది లబ్ధిదారులకు రూ.11,20,64,500 లను పంపిణీ చేయవలసి ఉండగా వారిలో 26,021 మందికి రూ. 10,81,48,500లు పంపిణీ చేశారు. ఒకటవ తేదీ పెన్షన్ తీసుకోని లబ్ధిదారులు 3వ తేదీన వారి వారి గ్రామాలలో పెన్షన్ పంపిణీ చేయు సిబ్బందికి అందుబాటులో ఉండాలని కోరుతున్నారు.

పవన్ కళ్యాణ్‌కు మద్దతుగా పంచకర్ల ప్రాయశ్చిత్త దీక్ష

విశాలాంధ్ర - పెందుర్తి: హిందుధర్మ పరిరక్షణ కోసం దీక్ష చేపట్టిన ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు మద్దతుగా పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు ఆధ్వర్యంలో జనసేన నాయకులు ప్రాయశ్చిత్త దీక్ష చేపట్టారు. సుజాతనగర్‌లో గల శ్రీ విశాలాక్షి విశ్వేశ్వర ఆలయం ఆవరణలో దీపారాధన చేసి జనసేనాని దీక్ష విజయవంతం కావాలని పూజాదికాలు నిర్వహించారు. జనసైనికులు, వీరమహిళలు దీపారాధనతో పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు మీడియాతో మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ చేస్తున్న దీక్షకు రాష్ట్ర వ్యాప్తంగా మంచి మద్దతు లభించిందని, అనేక ఆలయాలలో ప్రజలు పూజలు నిర్వహిస్తున్నారని తెలిపారు. పవన్ తిరుపతి బయలుదేరి మెట్లు మార్గంలో కొండపైకి చేరుకుంటారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో 95వ వార్డు జనసేన అధ్యక్షులు కంచిపాటి మధు, 97వ వార్డు అధ్యక్షులు సేనాపతి సోమశేఖర్, 88వ వార్డు అద్యక్షులు జనార్దన్, నాయకులు గొర్లె అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు కార్మిక సంఘాల నిరసన ప్రదర్శన

విశాలాంధ్ర - కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రభుత్వ రంగంలో కొనసాగించాలని, సెయిల్‌లో విలీనం చేయాలని ఉక్కు అఖిలపక్ష కార్మిక సంఘాలు తెలిపాయి. అక్టోబర్ 2న కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా కూర్మన్నపాలెం ఉక్కు దీక్షా శిబిరంలో ఉక్కు కార్మికులు, కాంట్రాక్ట్ కార్మికులు, కుటుంబాలతో హాజరు కావాలని కోరారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరిగే నిరసన ప్రదర్శనలో పాల్గొనాలని అఖిల పక్ష కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి.

డాక్‌యార్డు పరిసర ప్రాంతాలను సందర్శించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర - మల్కాపురం: డాక్‌యార్డ్ ఎంప్లాయిస్ ప్రత్యామ్నాయ మార్గం పరిష్కారం కోసం డాక్ యార్డ్ పరిసర ప్రాంతాలను మంగళవారం పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే గణబాబు సందర్శించారు. ఈ సందర్భంగా నేవల్ డాక్‌యార్డులో వేలాదిమంది ఉద్యోగస్తులు సర్దార్ వల్లభాయ్ పటేల్ బ్రిడ్జి మీదగా ప్రయాణం సాగిస్తుండేవారని ఇప్పుడు మరమ్మత్తులు కారణంగా కాన్వెంట్ జంక్షన్, మేఘన పేట, అశోక పార్క్ నుంచి వచ్చే ఎంప్లాయిస్ షీలా నగర్ వెళ్లి తిరిగి కృష్ణ గేటుకి రావడం వల్ల 13 కిలోమీటర్లు అదనంగా ప్రయాణించడమే కాకుండా భారీ వాహనాల మధ్య ప్రయాణించడం వల్ల ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. ప్రత్యామ్నాయ తాత్కాలిక పరిష్కారంగా ఎస్బిసి వద్ద మేఘాద్రి గేటు అలాగే విజయనగరం గేటు మీదగా నేవల్ ఎంప్లాయిస్‌కి అనుమతి ఇవ్వాలని ఎమ్మెల్యేను కోరారు. ఈ కార్యక్రమంలో ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE XIV ADDL. FAMILY JUDGE AT VIJAYAWADA
F.C. O.P. NO. 1241/2023

Between:
Kasina Naga Tripura ... Petitioner
AND
Kasina Lakshmi Venkata Subbarao .... Respondent

To,
Kasina Lakshmi Venkata Subbarao, S/o. Naga Malleswara Rao, R/o. 1-133-8, M.V.P. Colony, Ushodaya Junction, L.B. Colony, Visakhapatnam.

పై నెంబరు పిటీషన్‌లోని రెస్పాండెంట్ అయిన మీకు శ్రీ కోర్టు వారు ఎన్నిసార్లు నోటీసులు పంపిననూ తీసుకొనక కాలయాపన చేయుచున్నందున ఈ పేపరు ప్రకటన ద్వారా మీరు ది.29-11-2024న ఉదయం గం.10.30 ని.లకు పై కోర్టు వారి ఎదుట హాజరై ఆక్షేపణలు ఉన్నయెడల తెలుపుకోవలెను. లేనియెడల పై పిటీషన్ మీ పరోక్షమున తీర్మానింపబడును.

/// శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం ///

వాయిదా తేదీ: 29-11-2024

కాశినా నాగ త్రిపుర, పిటీషనర్
విజయవాడ

తాళ్లవలసలో పొలం పిలుస్తోంది

విశాలాంధ్ర - తగరపువలస: తాళ్లవలస గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో కలెక్టర్ హరేంధిర ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా తాళ్లవలస గ్రామంలో ఈ పంట నమోదును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొలం పిలుస్తోంది కార్యక్రమం ప్రతి మంగళ, బుధవారంలో గ్రామాల్లో జరుగుతుందని, వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులు, శాస్త్రవేత్తలు గ్రామాలలో పాడి పశువులను మొదలగు వ్యవసాయం అనుబంధ విషయాలలో రైతులకు అధిక దిగుబడి కోసం సూచనలు చేస్తారని తెలిపారు. తప్పకుండా ఈ సూచనలు పాటించి అధిక దిగుబడులు పొందాలని, ప్రభుత్వం ద్వారా రైతు సేవ కేంద్రాల నుంచి ఎరువులు విత్తనాలు యంత్ర, పరికరాలు, సరఫరా చేయనున్నదని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి అప్పలస్వామి, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రామకృష్ణ, సూక్ష్మ నీటి శాఖ పిడి మన్మధరావు, ప్రకృతి వ్యవసాయం డిపిఎం మోహన్‌రావు, చెరుకు పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త శ్రీలత, స్థానిక భీమిలి డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు బి.విజయప్రసాద్, భీమిలి వ్యవసాయ అధికారిణి బి.శివ కోమలి, తహశీల్దార్ రామారావు, జెడ్పీటీసీ సభ్యులు గాడు వెంకటప్పడు, రాజు, బి.ఎస్.ఎన్.రాజు వర్మ పాల్గొన్నారు.

MANAPPURAM HOME FINANCE PVT. LTD.

మనప్పురం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్
పూర్వం మనప్పురం హోమ్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌గా తెలిసినది, CIN: U65923K12010PIC039179
యూనిట్ 301-315, 3వ అంతస్తు, ఏ వింగ్ కనకియా వాల్‌స్ట్రీట్, అంధేరీ-కుర్లా రోడ్, అంధేరి ఈస్ట్, ముంబై-400093.

స్వాధీనత ప్రకటన
(స్థిర ఆస్తి కొరకు)

సెక్యూరిటైజేషన్ అండ్ రికన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ *[చట్టం], 2002 (54 ఆఫ్ 2002) మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలు- 2002 యొక్క నిబంధన 9 తో చదివే సెక్షన్ 13(12) కింద సంక్రమించిన అధికారాలను వినియోగించి మనప్పురం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ ("ఎంఎహెచ్‌ఓఎఫ్‌ఐఎల్") యొక్క అధీకృతఅధికారిగా దిగువ సంతకందారు, ఈ నోటీసులో పేర్కొన్న బాకీ మొత్తాన్ని మరియు దానిపై వడ్డీని సదరు నోటీసు అందిన తేదీ నుండి 60 రోజుల్లోగా తిరిగి చెల్లించవలసిందిగా ఈ కింద ప్రస్తావించిన రుణగ్రహీత(లు) / సహ రుణగ్రహీత(లు) లకు పిలుపునిస్తూ డిమాండ్ నోటీసులు జారీచేయడమైనది. రుణగ్రహీత బాకీ మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో విఫలమైనందున పేర్కొన్న నిబంధనల యొక్క నిబంధన 9తో చదివే సదరు *[చట్టం] లోని సెక్షన్ 13 (4) కింద అతను/ఆమెకు సంక్రమించిన అధికారాలను వినియోగించి, కింద వివరించిన ఆస్తులను కింద పట్టికలో పేర్కొన్న తేదీలలో దిగువ సంతకందారు లాంఛనప్రాయంగా స్వాధీనపరుచుకున్నట్లు రుణగ్రహీత మరియు సాధారణ ప్రజానీకానికి నోటీసు ఇవ్వడమైనది. ఈ ఆస్తితో ఎటువంటి లావాదేవీలు నెరపరాదని మరియు ఆస్తితో ఎటువంటి లావాదేవీలైనా కింద వివరించినట్లుగా ఆయా ఆస్తుల కొరకు మనప్పురం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ చార్జికి లోబడి ఉండునని ఇందుమూలంగా ప్రత్యేకించి రుణగ్రహీత మరియు సాధారణ ప్రజలను హెచ్చరించడమైనది.

వ. సం.	రుణగ్రహీత/ సహ-రుణగ్రహీత/ మరియు లోన్ ఎకౌంట్ నం.	ఆసక్తి ఏర్పాటు చేయబడిన హామీగా పెట్టిన ఆస్తి వివరాలు	డిమాండ్ నోటీసు పంపిన తేదీ & మొత్తం బాకీ	వాస్తవ స్వాధీనత తేదీ
1.	సోమల లోవ లక్ష్మి, సోమల పైడిరాజు & సోమల ప్రేమ్‌కుమార్/ MA90MHLONS000005010402/ విశాఖపట్నం	ఎస్.నం. 155, డి.నం: 1-17, యలమంచిలి మండలం, కట్టుపాలెం, ఎస్‌సి కాలనీ, విశాఖపట్నం, పి.ఓ, మెలుపాక, ఆంధ్రప్రదేశ్, పిన్-531055.	17/01/2023 & రూ.6,68,515/-	27-09-2024

తేదీ : 02-అక్టోబరు-2024, ప్రదేశం : విశాఖపట్నం
సం/- అధీకృత అధికారి, మనప్పురం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్

దోమలపై డ్రోన్లతో సమరం

విశాలాంధ్ర - పెందుర్తి: జీవిఎంసీ 95వ వార్డులో నీటి నిల్వలలో దోమల సంతతి పెరగకుండా ఎంఎల్ ఆయిల్ స్ప్రేయింగ్ డ్రోన్లను మంగళవారం స్థానిక కార్పొరేటర్ ముమ్మన దేముడు ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య దృష్ట్యా డెంగ్యూ, మలేరియా, కలరా ఇతర సీజనల్ వ్యాధులు నియంత్రణ కొరకు మలేరియా డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో డ్రోన్ల ద్వారా (ఎం.ఎల్ ఆయిల్) క్రిమి సంహారక మందులు పిచికారీ చేయిస్తున్నట్లు తెలిపారు. జీవీఎంసీ జోన్ -8 పరిధి 95వ వార్డు పురుషోత్తపురం వెంకప్ప చెరువు,జ్యోతి నగర్ చెరువు,లక్ష్మీపురం రాముడు చెరువులలో స్ప్రేయింగ్ చేయించామన్నారు. కార్యక్రమంలో జోన్ - 8 మలేరియా ఇన్స్పెక్టర్ దాలి నాయుడు, సూపర్వైజర్ సత్యనారాయణ, కోలనీ ప్రతినిధులు రమణమూర్తి, వై.సత్యనారాయణ, ఓంశాంతి వెంకట్రావు, ప్రభు,రాజు పాల్గొన్నారు.

శ్రీ చైతన్య పాఠశాలలో దసరా సంబరాలు

విశాలాంధ్ర - పెందుర్తి: పెందుర్తి శ్రీ చైతన్య టెక్నో స్కూల్ లో దసరా ఉత్సవాలను పురస్కరించుకొని సంబరాలు ఘనంగా నిర్వహించారు. పాఠశాలల రీజినల్ ఇంచార్జ్ మహమ్మద్ అలీ జ్యోతి ప్రజ్వాలన చేసి ఉత్సవాలను ప్రారంభించారు. ముద్దులొలికే చిన్నారులు నవదుర్గలుగా అలంకరించుకొని సాక్షాత్తు ఆ అమ్మవారిని తలపించారు. విద్యార్థిని విద్యార్థులు తమ ఆట పాటలతో, నృత్యాలతో అలరించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.తారకేశ్వరరావు మాట్లాడుతూ హిందువుల ముఖ్యమైన పండుగ గనక "శరన్నవరాత్రి " అని అంటారని తెలిపారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర పాఠశాలల ఏజీఎం ఎం వి సురేష్, పాఠశాలల రీజనల్ ఇంచార్జ్ మహమ్మద్ అలీ, అకాడమిక్ డీన్ ఎస్. వి గోవిందరావు, సి బ్యాచ్ ఇంచార్జ్ ఎం. ఆర్. వి శేషగిరి, అసిస్టెంట్ డీన్ హాఫసా, ప్రీ ప్రైమరీ ఇంచార్జ్ టి.శోభ, ఉపాధ్యాయ ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

బిఎండబ్ల్యూ గ్రూప్ రిటైల్ నెక్స్ ప్రారంభం

విశాలాంధ్ర - విశాఖపట్నం: భారతదేశంలో బిఎండబ్ల్యూ గ్రూప్ ఇండియా రిటైల్ నెక్స్ డీలర్‌షిప్‌లను పరిచయం చేస్తున్నట్లు ప్రకటించింది. శ్రేష్ఠతను అందించేందుకు, ఆధునిక అవసరాలను తీర్చడానికి పునర్నిర్మించిన సేవలు, సౌకర్యాలు రిటైల్.నెక్స్‌లో ఉంటాయి. రానున్న 36 నెలల్లో 33 నగరాల్లోని 56 సౌకర్యాలలో రిటైల్.నెక్స్ సేవలు అందుబాటులోకి వస్తాయి. విక్రమ్ పవాహ్, ప్రెసిడెంట్ మరియు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ బిఎండబ్ల్యూ గ్రూప్ ఇండియా మాట్లాడుతూ, "బి ఎం డబ్ల్యూ గ్రూప్ ఇండియాలో రిటైల్.నెక్స్ పరిచయం వినూత్నంగా చెప్పారు.

అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం



విశాలాంధ్ర - ఆనందపురం: మండలంలో శొంఠ్యాం పంచాయతీ పరిధిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో అంతర్జాతీయ వృద్ధులు దినోత్సవం పురస్కరించుకొని 60 సంవత్సరాలు పైబడిన వృద్ధులకు రక్తపోటు మధుమేహం పరీక్షలు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ బి.రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అసంక్రమణ వ్యాధుల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి ఎం.పరమేశ్వరరావు, ఆరోగ్య పర్యవేక్షకులు ఈశ్వరరావు, కళ్యాణమ్మ, ఎంఎల్‌హెచ్‌పి, సిహెచ్‌ఓ ఎం.ఇందు, హెచ్‌ఐవి సమన్వయకర్త సుజాత, ఆశ వర్కర్ అన్నపూర్ణ, శివశంకరి, తదితరులు పాల్గొన్నారు.

సింపోలో టైల్స్ 'పర్‌స్పెక్టివ్-2025' వార్షిక ఉత్పత్తి ఆవిష్కరణ

విశాలాంధ్ర - విశాఖపట్నం: సిరామిక్స్ సర్ఫేస్ డిజైన్ పరిశ్రమలో అగ్రగామిగా ఉన్న సింపోలో టైల్స్, బాత్‌వేర్, కొచ్చిన్‌లో పెర్‌స్పెక్టివ్-2025 అనే అత్యంత ఎదురుచూసిన ప్రోడక్ట్ లాంచ్ ఈవెంట్‌ని విజయవంతంగా నిర్వహించింది. ఈ ఈవెంట్‌లో భారతదేశం అంతటా 400 కి పైగా ప్రీమియం డీలర్‌లు, కేరళ అంతటా 100 కి పైగా కంటే ఎక్కువ మంది ప్రముఖ ఆర్కిటెక్ట్‌లు పాల్గొన్నారు, వారు ఆధునిక నిర్మాణం మరియు డిజైన్ యొక్క అభివృద్ధి చెందుతున్న అవసరాలను తీర్చడానికి రూపొందించిన సింపోలో యొక్క తాజా అత్యాధునిక సేకరణలు మరియు ఉపరితలాల ఆవిష్కరణను చూసేందుకు సమావేశమయ్యారు. ఈ సంవత్సరం థీమ్, "ఫ్రెష్ ఫ్రమ్ ది పాస్ట్", సేకరణలకు టోన్ సెట్ చేసింది, ఇది ఆధునిక కార్యాచరణతో చారిత్రక అంశాలను సజావుగా మిళితం చేసింది. ఈవెంట్ యొక్క ముఖ్యాంశం కొత్త పోస్ ప్లస్ ఉపరితల పరిచయం, ఇది సింపోలో యొక్క ఐకానిక్ పోస్ ఉపరితలానికి ఒక వినూత్న అప్‌గ్రేడ్ అని ఆ సంస్థ ప్రతినిధి చెప్పారు.

ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు అందజేత



విశాలాంధ్ర - మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతం పరిధి 62వ వార్డ గుడివాడ అప్పన్న కాలనీలో రాష్ట్ర ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి నీలా జోగి మంగళవారం ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది వెల్ఫేర్ సెక్రెటరీ శ్రీనివాస్ బూత్ కన్వీనర్ నగిరెడ్ల నర్సింగరావు, అన్నిపు చంద్రశేఖర రావు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సింగపూర్ ఎయిర్‌లైన్స్‌తో ఎస్‌బిఐ కార్డ్ భాగస్వామ్యం

విశాలాంధ్ర-విశాఖపట్నం: సింగపూర్ జాతీయ రాయబరి అయిన సింగపూర్ ఎయిర్‌లైన్స్ లిమిటెడ్ (ఎస్ ఐ ఏ) భాగస్వామ్యంతో భారతదేశపు అతిపెద్ద ప్యూర్-ప్లే క్రెడిట్ కార్డ్ జారీచేసే ఎస్?బిఐ కార్డ్, ఈ రోజు క్రిస్‌ఫ్లైయర్ ఎస్?బిఐ కార్డ్ ను ప్రారంభించింది. ఈ రకమైన ట్రావెల్ కి సంబంధించిన కో బ్రాండెడ్ క్రెడిట్ కార్డ్ సూపర్ ప్రీమియం కార్డ్ హోల్డర్‌లకు అనుకూలంగాలేఖ రూపొందించబడింది . ఇది ఎస్ ఐ ఏ గ్రూప్‌తో గాలిలో మరియు భూమిలో ప్రత్యేక అధికారాలను అందిస్తోంది ఈ ఎస్ ఐ ఏ గ్రూప్లో సింగపూర్ ఎయిర్‌లైన్స్, స్కూట్ ఎయిర్‌లైన్స్ క్రిష్ షాప్ డాట్ కామ్, క్రిస్ ప్లస్ జీవనశైలి యాప్ మరియు పెలాగో ఉన్నాయి. కొత్తగా ప్రారంభించబడిన క్రెడిట్ కార్డ్ క్రిస్‌ఫ్లైయర్ ఎస్?బిఐ కార్డ్ మరియు క్రిస్‌ఫ్లైయర్ ఎస్?బిఐ కార్డ్ అపెక్స్ అనే రెండు వేరియంట్లలో అందుబాటులో ఉంది.

యువత స్వచ్ఛభారత్‌ను ఉద్యమంలా చేపట్టాలి

విశాలాంధ్ర - మల్కాపురం: యువత స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని ఉద్యమంలా చేపట్టాలని, పరిశుభ్ర భారతావని నిర్మాణంలో కీలక పాత్ర వహించాలని సెయింట్ ఆన్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ ప్రేమకుమారి అన్నారు. స్థానిక సెయింట్ ఆన్స్ కళాశాల ఆవరణలో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో నిర్వహించిన స్వచ్ఛత హీ సేవ 4.0 కార్యక్రమం ముగింపు సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా ప్రసంగించారు. సెయింట్ ఆన్స్ కళాశాలకు చెందిన జాతీయ సేవా పథక వాలంటీర్లు ఒక్కొక్కరు మూడు కేజీల సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించి పరిసర ప్రాంతాలను శుభ్రం చేశారని ప్రశంసించారు. కార్యక్రమంలో 60వ వార్డు శానిటరీ ఇన్స్‌పెక్టర్ సతీష్, జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రామ్ అధికారి ఇ.పి.ఎస్. భాగ్యలక్ష్మి, సీనియర్ ప్రోగ్రాం అధికారి వై.అనసూయా దేవి, సెయింట్ ఆన్స్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సిస్టర్ కేస్లీన్, కళాశాల కరస్పాండెంట్ సిస్టర్ గెసిల్ల, ఇతర జాతీయ సేవా పథక ప్రోగ్రాం అధికారులు అంజలీదేవి, సంధ్యారాణి, నదియా, 200 మంది జాతీయ సేవా పథక కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు 9 ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

విశాలాంధ్ర - ఆనందపురం: ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జోన్ 3 పోలాకి శ్రీనివాస రావు ఆదేశాల మేరకు ఆనందపురం మండలంలో 33/11 కేవీ సబ్ స్టేషన్ పెద్దిపాలెం పీడర్ మరమ్మతులు నిమిత్తం మండలంలో పెద్దిపాలెం, పల్లి పేట, మచ్చవానిపాలెం పొడుగు పాలెం, చందక, గొట్టి పల్లి, వెంకటాపురం, కుసులవాడ, బీపీ కల్లాలు, తదితర ప్రాంతాలకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని ఏఈ సురేష్ కుమార్ తెలిపారు.

స్నిగ్ధశ్రీదేవి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు

విశాలాంధ్ర - తగరపువలస: కలిగొట్ల స్నిగ్ధశ్రీదేవి ఫౌండేషన్ వారి సేవా కార్యక్రమాల్లో భాగంగా చిట్టివలస అంబేద్కర్ జీవీఎంవీ ఎలిమెంటరీ స్కూల్‌కు ఇంగ్లీష్ లాబ్ నిమిత్తం 10000 రూపాయలు విలువచేసే ఫర్నిచర్ ఫౌండేషన్ ఛైర్మన్ కలిగొట్ల శ్రీరామ్ చేతులమీదుగా అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్కూల్ హెచ్‌ఎమ్ పద్మావతి, ఇతర ఉపాధ్యాయులు లీలామణి, ప్రసాద్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర ధరలు తగ్గించాలి

విశాలాంధ్ర - కొమ్మాది: నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెంచిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే ధరలు తగ్గించాలని సిపిఎం మధురవాడ జోన్ కమిటీ డిమాండ్ చేసింది. పెంచిన ధరలు తగ్గించాలనీ కోరుతూ మధురవాడ మార్కెట్ కూడలి వద్ద మంగళవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్ల కార్డులు ప్రదర్శించి పెద్దయెత్తున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మధురవాడ జోన్ కమిటీ కార్యదర్శి డి.అప్పలరాజు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక పేద,మధ్య తరగతి ప్రజలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారనీ అన్నారు. సుమారు మూడు నెలల కాలం నుండి కూరగాయలు, టమాటా ఉల్లిపాయలు ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయని అన్నారు. కిరాణా సామాన్ల రెట్లు అదేవిధంగా పెరుగుతూన్నాయని తెలియజేశారు. నిరుద్యోగం పెరిగి మరింత నిరాశ, నిస్పృహకు లోనవుతున్నారని అన్నారు. కార్యక్రమంలో సిపిఎం, సీఐటీయూ నేతలు పి.రాజ్‌కుమార్, డి.కొండమ్మ, బి.భారతి, టీకే శారద, కే.సుజాత, డీ.తులసి, వాసంతి, ప్రసన్న, తదితరులు పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో పొలం పిలుస్తోంది

విశాలాంధ్ర - ఆనందపురం: ఆనందపురం మండలంలో శొంఠ్యం, మామిడిలోవ గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మండల వ్యవసాయ అధికారిని సంధ్య రత్న ప్రభ మాట్లాడుతూ పొలం పిలుస్తుంది కార్యక్రమం ఆవశ్యకత గురించి వివరించారు. అదే విదంగా మట్టి నమూనాలు ఏ విదంగా సేకరించాలి, మట్టి నమూనాల ఫలితాలు విశ్లేషణ గురించి వివరించడం జరిగింది. అదే విదంగా ప్రకృతి వ్యవసాయంలో విభాగం ఎన్‌ఎఫ్‌ఏ శ్రీనివాస చక్రవర్తి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం యొక్క ఆవశ్యకత, ప్రకృతి వ్యవసాయంలో పంటలను పండించే విధానం, పురుగులు తెగుళ్ల నివారణకు ప్రకృతి వ్యవసాయం లో కషాయాలు కోసం పలు పంటలు ఏ విధంగా సాగు చెయ్యాలి, రైతులకు మార్కె టింగ్ కొరకు రైతులకు చెప్పడం జరిగింది.అదే విదంగా ఈ కార్యక్రమానికి శొంఠ్యం అగ్రికల్చర్ అసిస్టెంట్ కె.వినూత్న తదితరులు పాల్గొన్నారు.

ఎంపీపీ స్కూల్ విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

విశాలాంధ్ర - తగరపువలస: మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాల కృష్ణంరాజుపేటలో పి ఎం సి వైస్ చైర్మన్ రమణ చేతుల మీదుగా ప్రభుత్వం సరఫరా చేసిన సెకండ్ సెమిస్టర్ టెస్ట్ బుక్స్‌ను పిల్లలందరికీ అందజేయడం జరిగింది. దసరా సెలవుల్లో పిల్లలు చదువుకోడానికి వీలుగా ఈ టెస్ట్ బుక్‌లో కంటెంట్‌లో వివరించి పిల్లలకు అందజేయడం జరిగింది.

ప్రణాళికాయుతంగా పనులను చేయండి

ప్రజా ప్రతినిధులు, అధికారులు సమిష్టి కృషితో పని చేద్దాం

విశాఖ పార్లమెంటు సభ్యులు ఎం.శ్రీభరత్

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ చేపడుతున్న ప్రాజెక్టులు, అభివృద్ధి పనులు శాశ్వత పద్ధతిన ప్రణాళికాయుతంగా వుండాలని, ప్రజా ప్రతినిధులు, అధికారులు సమిష్టిగా పనిచేయాలని విశాఖ పార్లమెంటు సభ్యులు ఎం.శ్రీభరత్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన ప్రభుత్వ అతిథి గృహంలో జివిఎంసి అభివృద్ధి పనులపై విశాఖ శాసనసభ్యులు వెలగపూడి రామకృష్ణ బాబు, పి.జి.వి.ఆర్. నాయుడు (గణబాబు), సి.హెచ్.వంశీకృష్ణ శ్రీనివాస్, విష్ణు కుమార్ రాజు, పల్లా శ్రీనివాస రావు, పంచకర్ల రమేష్ బాబు, శాసన మండలి సభ్యులు దువ్వారపు రామరావు, వేపాడ చిరంజీవి రావు, ఎపియుఎఫ్ఐడిసి చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, జివిఎంసి టిడిపి ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాస రావు, టిడిపి జిల్లా అధ్యక్షులు గండి బాబ్జి, జివిఎంసి కమిషనర్ డాక్టర్ పి.సంపత్ కుమార్ ఇతర అధికారులతో సమీక్షించారు. ఈ సమావేశంలో ముందుగా జివిఎంసి కమిషనర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జివిఎంసి అభివృద్ధి కార్యక్రమాలపై వివరిస్తూ జివిఎంసి ఆదాయం, ఖర్చు, సిబ్బంది, రోడ్లు, అభివృద్ధి, వీధిలైట్లు, 24 గంటలు తాగునీరు సరఫరా ప్రణాళిక, కొండవాల ప్రాంతాల అభివృద్ధి, క్రీడ మైదానాలు అభివృద్ధి, 15వ ఆర్థిక సంఘం అమృత-20 నిధులతో అభివృద్ధి పనులు, తాగునీటి సరఫరా, కాలుష్య నియంత్రణ చర్యలు, భూగర్భ మురుగునీటిపారుదల వ్యవస్థ, ఆర్థిక విభాగం బలోపేతం తదితర వాటిపై వివరిస్తూ ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్, ప్రజా ఆరోగ్య విభాగము, యుసిడి విభాగం, మొక్కల విభాగం తదితర విభాగాలు చేపడుతున్న అభివృద్ధి పనులపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రజా ప్రతినిధులకు తెలిపారు. ఈ సందర్భంగా విశాఖ పార్లమెంటు సభ్యులు మాట్లాడుతూ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని జివిఎంసి అధికారులు ముందస్తు ప్రణాళికతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని నగరంలో ప్రధానంగా తాగునీరు, వీధి దీపాలు, కొండవాలు ప్రాంతాలు, రోడ్లు, కాలువలు, పార్కుల అభివృద్ధి, పారిశుద్ధ్యం, క్రీడలు, ఆక్రమణలు మొదలైన వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. తాగునీరు ప్రతి కుటుంబానికి అందేలా చర్యలు చేపట్టాలని నగరమంతా తాగునీరు కేవలం 30 నిమిషాలు మాత్రమే కొన్ని చోట్ల ఇస్తున్నారని ఆ సమస్య లేకుండా నగరమంతా 24/7 తాగునీరు సరఫరా చేసే విధంగా ఆచరణలోనికి తీసుకురావాలని, అందుకు కావలసిన వనరులు ఇప్పటినుండే సమీకరించుకోవాలని కమీషనర్‌కు ఆదేశించారు. వీధి దీపాల నిర్వహణ సమస్య అధికంగా ఉన్నందున నగరములో ప్రతి దీపం వెలిగేలా అందుకు తగ్గట్టుగా గుర్తించిన 157 బ్లాక్ స్పాట్లలో ఖచ్చితంగా లైట్లు త్వరితగతిన అమర్చాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. 2026 తర్వాత నగరంలో మురుగునీరు సముద్రంలో కలగకుండా చర్యలు చేపట్టి అందుకు కావలసిన ట్రీట్మెంట్ ప్లాంట్లను అభివృద్ధి చేసుకోవాలని, దోమల నియంత్రణ చర్యలు చేపట్టి ప్రజల ఆరోగ్య రక్షణ చర్యలు చేపట్టాలని అన్నారు. వీధి వ్యాపారస్తులను ట్రాఫిక్‌కి అంతరాయం కలగకుండా వారిని నియంత్రించాలని, ఫుడ్ కోర్ట్‌పై వస్తున్న ఆరోపణను సమగ్ర విచారణ చేపట్టాలని, దువ్వాడలో ఐటి హిల్స్, ఆర్కే బీచ్ తదితర ప్రాంతాలలో 24 గంటలు ఫుడ్ స్టాల్స్ ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని, నగరంలో పారిశుద్ధ్య కార్మికుల కొరత ఉన్నందున పొరుగు సేవల ద్వారా ఉద్యోగ నియమాకాలను చేపట్టేందుకు ప్రభుత్వానికి నివేదించాలని, గ్రామ కంఠాలలో ఉన్న గృహాలకు ఆస్తి పన్ను విధింపు మార్గాలను అన్వేషించాలని, నగరంలో ట్రాఫిక్ కు అంతరాయమున్న ఆక్రమణ బడ్డీలను తొలగించాలని, నిర్ధిత సమయంలో బిల్డింగ్ ప్లానుల మంజూరుకు చర్యలు చేపట్టాలన్నారు. నగరంలో జివిఎంసి స్థలాలు అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని పేదలకు గృహ సముదాయం నిర్మించి ఇచ్చేందుకు ఉపయోగపడ తాయన్నారు. అనంతరం పలువురు శాసనసభ్యులు, శాసన మండలి సభ్యులు జివిఎంసి అభివృద్ధి పనులపై చర్చించి పరిష్కార మార్గ దిశగా చర్యలను చేపట్టాలని కమీషనర్ కు వివరించారు. ఈ కార్యక్రమంలో జివిఎంసి అదనపు కమీషనర్‌లు, ఇంజనీర్లు, ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

అంధకారంలో బిర్లా కూడలి: లక్ష్మీనివాస్ రోడ్డు బురదమయం

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: నగరంలోని అత్యంత ప్రాధాన్యత గల, రద్దీ ప్రాంతమైన బిర్లా కూడలి అంధకారంలో మగ్గుతుంది. రెసిడెన్సిన్ హబ్‌గా పిలవబడి జాతీయ రహదారిని ఆనుకొని వున్న జ్యోతినగర్‌కి వెళ్లే సబ్ వే, ఇండస్ట్రియల్ ఎస్టేట్ వైపు వెళ్ళే లక్ష్మీ నివాస్ అపార్ట్మెంట్ రోడ్డు దీపాలు వెలగక, చీకటి వల్ల అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సిటీలో స్కూలు, కాలేజీలు, వివిధ కార్యాలయంలో మంచి వచ్చే విద్యార్థులు, మహిళలు ఈ రోడ్డు గుండా నడిచి వెళ్లేందుకు భయభ్రాంతులకు గురవుతున్నారు. సాయంత్రం ఏడు గంటల తర్వాత వచ్చే వారికి ఇబ్బందులు తప్పట్లేదు. సిటీ నుంచి వచ్చినవారు బిర్లా జంక్షన్లో బస్ స్టాప్ లో దిగి వెనక్కు నడిచివచ్చి లక్ష్మీ నివాస్ గేటెడ్ కమ్యూనిటీ అపార్ట్మెంట్లకు వెళ్లే మహిళలు, విద్యార్థులు ఎవరో ఒకరు తోడుంటే గాని ఆ రోడ్డు లో వెళ్ళలేని పరిస్థితి. లక్ష్మీ నివాస్ గేటెడ్ కమ్యూనిటీలో 200 పైచిలుకు కుటుంబాలు ఉన్నాయి. ఇందులో వెయ్యికి పైగా ప్రజలు నివసిస్తున్నారు. ప్రతి ఒక్కరూ ఏదో ఒక పని మీద రాకపోకలు సాగిస్తున్నారు. వాహనాలు ఉన్నవారి పరిస్థితి ఎలా ఉన్నా స్కూల్లు, కాలేజీలు, కార్యాలయంలో పనిచేసే మహిళలు మాత్రం నడిచి వెళ్లేందుకు భయపడుతున్నారు. ఓవైపు గెడ్డ ఉండడం ,గుబురుగా చెట్లు మొలవడం వల్ల చీకటిలో పాములు, తేళ్లు తిరగడం వల్ల ఎటు నుంచి ఏమి వస్తుందో అని భయం పడుతున్నారు. మరోవైపు టూ వీలర్‌పై వచ్చేవారు స్పీడ్ బ్రేకులు కనిపించక ప్రమాదానికి గురవుతున్నారు. బిర్లా జంక్షన్ బస్టాప్ దగ్గర దిగి జ్యోతి దగ్గర వరకు వెళ్లేవారు కూడా చీకట్లో నడవలేక సతమతమవుతున్నారు. లక్ష్మీ నివాస్ రోడ్డు వైపు విద్యుత్ స్తంభాలు ఉన్నప్పటికీ అవి వెలగడం లేదు. ఈ కూడలి లో నాలుగు లైట్లుతో కూడిన ఎల్ఈడి విద్యుత్ స్తంభం ఏర్పాటు చేయాలని, అదేవిధంగా రోడ్డు పొడవునా వీధి దీపాలు కూడా వెలిగే విధంగా చర్యలు తీసుకోవాలని జీవిఎంసీ అధికారులను కోరుతున్నారు.

రోడ్డంతా బురదమయం

జాతీయ రహదారి నుంచి లక్ష్మీ నవాస్ గేటెడ్ కమ్యూనిటీ కి వెళ్లే రోడ్డు బురదమయమై ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇక్కడ ఓ పెద్ద సంస్థ భారీ గేటెడ్ కమ్యూనిటీ నిర్మిస్తుంది. దీనికి నిరంతరం మట్టి తవ్వి తరలించే పనులు జరుగుతున్నాయి. ప్రతిరోజు ఈ రోడ్డు గుండా భారీ వాహనాల్లో మట్టిని తరలిస్తున్నప్పుడు బురదంతా రోడ్డు మీద పడుతుంది.దీని వల్ల ద్విచక్ర వాహనాలు ప్రమాదానికి గురవుతున్నాయి. ఈ రోడ్ లో ఉన్న స్పీడ్ బ్రేకర్లు కనబడకపోవడంతో జారి పడిపోతున్నారు. ప్రత్యామ్నాయ మార్గం ద్వారా తరలించడం గాని లేదా బురదపడకుండా జాగ్రత్తలు తీసుకోవడం గాని సంస్థ చేయటం లేదు.

సరుకు రవాణాలో గత రికార్డులను తిరగరాసిన విశాఖ పోర్టు



విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: విశాఖపట్నం పోర్టు అథారిటీ 2024-25 ఆర్థిక సంవత్సరపు తొలి అర్థ భాగంలో 41.79 మిలియన్ మెట్రిక్ టన్నుల కార్గోను రవాణా చేసింది. తద్వారా 2023-24లో ఇదే కాలంలో నిర్వహించిన 39.60 మిలియన్ మెట్రిక్ టన్నుల కంటే 6శాతం వృద్ధిని సాధించింది. క్రూడ్, ఎల్పీజీ, బొగ్గు, ఇతర వస్తువులు కర్గో హ్యాండ్లింగ్ లో పెరుగుదలను నమోదు చేశాయి. దీని ద్వారా విశాఖ పోర్ట్ దేశంలోని ప్రముఖ పోర్టులలో తన స్థానం ను మరింత బలోపేతం చేసుకుంది. 2024 ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీ దేశ ప్రగతికి సంబంధించి ప్రభుత్వ రంగానికి 100 రోజుల కార్యాచరణ ప్రణాళికను నిర్దేశించారు. ఇందులో భాగంగా పలు అంశాలను నిర్దేశించుకున్న విశాఖ పోర్ట్ పలు అంశాలలో గణనీయమైన ప్రగతిని సాధించింది. ప్రధాని మోదీ సంకల్పించిన "వికసిత భారత్ 2047" అనుగుణంగా, విశాఖ పోర్ట్ ఐటీ పురోగతి, పచ్చదనం, మౌలిక సదుపాయాలు, కార్పొరేట్ సామాజిక బాధ్యత వంటి ముఖ్యమైన రంగాలపై దృష్టి పెట్టింది. ఆయా అంశాలలో పోర్ట్ చేపట్టిన పనులు పోర్ట్ స్థిరమైన వృద్ధిని సాధించడం, పోర్ట్ లో పనితీరును మెరుగు పరచడం , సమాజం పై సానుకూల ప్రభావం ఏర్పరచడం వంటి లక్ష్యాలను నిర్దేశించుకోవడాన్ని సూచిస్తోంది. పోర్ట్ డిజిటల్ మార్పిడి లో కీలక పురోగతి సాధించింది, ఇందులో "నేషనల్ లాజిస్టిక్స్ పోర్టల్ మెరైన్ ను అమలు చేయడం జరిగింది. ఈ ఆవిష్కరణ షిప్పింగ్ లైన్లు, కస్టమ్స్ అధికారులు, పోర్టు హెల్త్ ఆఫీసర్ వంటి వివిధ భాగస్వాములతో సమాచార వ్యవస్థను అభివృద్ధి చేసి, సమయానుకూల సమాచార మార్పిడి , పారదర్శకతను పెంచింది. ఈ చర్య పోర్టు యొక్క కార్యకలాపాల సమర్థతను గణనీయంగా పెంచడంలో ముఖ్యపాత్ర పోషించింది. సైబర్ భద్రతను మెరుగుపర్చడంలో భాగంగా పోర్ట్ ఆన్‌లైన్ మోసాలను నిరోధించడంపై శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తోంది. సైబర్ భద్రతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించి 350 మంది ఉద్యోగులకు అవగాహన కల్పించారు. భవిష్యత్ సవాళ్లను ఎదుర్కోవడానికి, ఉద్యోగులను కర్మ యోగి ప్లాట్‌ఫారమ్‌లో పాల్గొనేల ప్రోత్సహించారు. విశాఖపట్నం పోర్టు అన్ని ప్రధాన పోర్టుల్లో 100 శాతం పునరుత్పాదక శక్తిని ఉపయోగించే" పోర్టుగా అవతరించింది. నౌకాశ్రయరంగంలో కార్బన్ ఉద్గారాలను తగ్గించడం లక్ష్యంగా పోర్టు చేపట్టిన కార్యకలాపాలలో భాగంగా సీ ఎన్ సీ ఆధారిత బస్సులు , స్వీపింగ్ యంత్రాలు, అగ్నిమాపక వాహనాలు" వినియోగించడం వలన గాలి నాణ్యత పెరగడంతో పాటు, పోర్ట్ లో భద్రత మెరుగుపడింది. 1మిలియన్ మొక్కలు కార్యక్రమాన్ని రాష్ట్ర అధికారులతో మరియు ప్రైవేట్ సంస్థలతో కలిసి పోర్ట్ ప్రారంభించింది. ఇప్పటికే 3 లక్షల మొక్కల కోసం విశాఖ చుట్టుపక్కల ప్రాంతాల నుంచి డిమాండ్ ఉందని అవసరాలకు అనుగుణంగా ఆ మొక్కలను అందజేస్తామని పోర్ట్ యాజమాన్యం వెల్లడించింది. విశాఖ పోర్ట్ పరిశీలోని ప్రాంతాలలో 1 మిలియన్ మొక్కలను నాటడమే లక్ష్యంగా పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ పోర్ట్ ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. సామాజిక బాధ్యత లో భాగంగా పోర్ట్ తన కార్యకలాపాలను కొనసాగిస్తోంది. ఇందులో భాగంగా విజయవాడ వరద బాధితుల సహాయార్థం సీఎం సహాయనిధికి పోర్ట్ 1 కోటి రూపాయలను విరాళంగా అందజేసింది. నిరుద్యోగ యువతకు ఉపాధికల్పించుందుకు ఉద్దేశించిన శిక్షణ కార్యక్రమాన్ని సెమ్స్ భాగస్వామ్యంతో కొనసాగిస్తోంది. సీ ఎన్ సి యంత్రాల నిర్వహణ" "గోదాముల నిర్వహణ"పై శిక్షణా కార్యక్రమాలను చేపట్టింది ఈ వివరాలను పోర్ట్ కార్యదర్శి టి.వేణుగోపాల్ మీడియాకు తెలియజేసారు.

విశాఖ వేదికగా గోల్ఫ్ టోర్నమెంట్

- నేటి నుంచి ఆరిలోవ ఈస్ట్ పాయింట్ గోల్ఫ్ క్లబ్‌లో పోటీలు
- దేశ, విదేశాల నుంచి గోల్ఫర్లు రాక
- కోటి రూపాయల ప్రైజ్ మనీ

విశాలాంధ్ర : విశాఖ సిటీ: అత్యంత ప్రతిష్టాత్మక ది ప్రొఫెషనల్ గోల్ఫ్ టూర్ ఆఫ్ ఇండియా (పీజీటీఐ), విశాఖలోని ఈస్ట్ పాయింట్ గోల్ఫ్ క్లబ్ ఆధ్వర్యంలో ఈనెల 2 నుంచి 5వ తేదీ వరకు 'వైజాగ్ ఓపెన్ 2024' పేరుతో గోల్ఫ్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు ఈస్ట్ పాయింట్ గోల్ఫ్ క్లబ్ కార్యదర్శి ఎంఎస్ఎన్ రాజు తెలిపారు. మంగళవారం ఈస్ట్ పాయింట్ గోల్ఫ్ క్లబ్‌లో మీడియా సమావేశంలో టోర్నమెంట్ వివరాలు వెల్లడించారు. విజేతకు టోర్నమెంట్ ప్రైజ్ మనీ కోటి రూపాయలు అందజేస్తున్నామన్నారు. ఈ టోర్నమెంట్‌కు హోస్ట్ వెన్యూ ఈస్ట్ పాయింట్ గోల్ఫ్ క్లబ్, అసోసియేట్ పార్ట్నర్స్ గా ఆల్వార్ దాస్ గ్రూపు, ఎస్ ఆర్ కే ఇన్ఫ్రా, విజయనగర్ బయోటెక్ ప్రైవేట్ లిమిటెడ్, ఎస్ఎల్పీ వెంచర్స్ సహకారం అందిస్తున్నారని చెప్పారు. ఈ టోర్నమెంట్ నిర్వహించడం గొప్ప గౌరవంగా భావిస్తున్నామని తెలిపారు. ఈ అత్యున్నత ఈవెంట్‌కు భారతదేశంలోని ప్రఖ్యాత గోల్ఫ్ ఆటగాళ్లు రానున్నారని చెప్పారు. అంతేకాకుండా 15 దేశాల నుంచి గోల్ఫ్ ఆటగాళ్లు వస్తున్నట్లు చెప్పారు. ఈ ఈవెంట్‌ను ప్రఖ్యాత ఛానళ్ళు యూరోస్పోర్ట్, ఏబీపీ ప్రసారం చేయనున్నట్లు తెలిపారు. ఈ టోర్నీని ప్రపంచ వ్యాప్తంగా 30 మిలియన్ల మంది వీక్షిస్తారన్నారు. ఈ ఈవెంట్ మా క్లబ్ ప్లేయర్‌లకు ప్రొఫెషనల్ గోల్ఫర్‌లతో కలిసి పోటీపడే అవకాశాన్ని అందిస్తుందన్నారు. కొత్తగా వచ్చే ఆటగాళ్లకు ఎంతగానో ఉపయోగపడతుందని చెప్పారు. ఈ విధమైన శిక్షణ వాళ్ళ జీవితాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దడానికి ఉపయోగపడుతుందని తెలిపారు. దేశవ్యాప్తంగా ఉన్న గోల్ఫ్ ఆటగాళ్ల నుంచి మంచి స్పందన వచ్చినందుకు సంతోషంగా ఉందన్నారు. 1884 సంవత్సరంలో ఏర్పడిన ఈస్ట్ పాయింట్ గోల్ఫ్ క్లబ్ 2021 ఫిబ్రవరిలో ఛాంపియన్‌షిప్ కైవసం చేసుకుందన్నారు. 2022 జియా సమ్మిట్ లో బెస్ట్ రెనోవేటెడ్ ప్రైజ్ గెలుచుకుందని చెప్పారు. 6871 గజాల వైశాల్యం కలిగి, పచ్చని కొండలు, రిజర్వాయర్, తాటిచెట్లు, నీటి కొలనలు, పచ్చని వృక్షాలతో ఉంటుందని, ప్రకృతి పరంగా అందమైన దృశ్య కావ్యంగా చెప్పొచ్చన్నారు. ఈస్ట్ పాయింట్ గోల్ఫ్ క్లబ్ అనేక ఇంటర్ క్లబ్, క్లబ్ స్థాయి టోర్నమెంట్లను సంవత్సరం పొడవునా నిర్వహిస్తుందని తెలిపారు. క్లబ్ లో జూనియర్ ప్రోగ్రాం లో భాగంగా 10 వేల రూపాయలకే శిక్షణను అందిస్తున్నామన్నారు. నావితో అనుబంధంగా పనిచేస్తూ సాహిక్కులకు అత్యుత్తమ శిక్షణలో అందించి జాతీయ అంతర్జాతీయ క్రీడాకారులను అందించడమే లక్ష్యంగా కృషి చేస్తున్నామన్నారు. పీజీటీఐ సీఈవో ఉత్తమ్ సింగ్ ముండే మాట్లాడుతూ రెండోసారి ఈస్ట్ పాయింట్ గోల్డ్ క్లబ్ కి రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ టోర్నమెంట్ ఎంతో ఉత్సాహాన్ని ఇస్తుందన్నారు. కొత్త ఆటగాళ్లకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. ఇదొక మరపురాని ఘట్టంగా ఉండబోతుందని తెలిపారు. ఈ ఈవెంట్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ శ్రీలంకకు చెందిన ఎన్ తంగరాజా, మరో ఆటగాడు కే ప్రబాగరన్, చెక్ రిపబ్లిక్‌కు చెందిన స్టెపాన్ డానెక్, బంగ్లాదేశ్‌కు చెందిన జమాల్ హొస్సేన్, బాదల్ హొస్సేన్, ఎండీ అక్బర్ హొస్సేన్, అండోరాకు చెందిన కెవిన్ ఎస్టీవ్ రిగైల్, నేపాల్‌కు చెందిన సుబాష్ తమాంగ్, కెనడాకు చెందిన సుఖరాజ్ సింగ్ గిల్, దక్షిణ కొరియాకు చెందిన సీ ఇన్ కిమ్, జపాన్‌కు చెందిన మకోటో ఇవాసాకి, అమెరికాకు చెందిన డొమినిక్ పిక్సిరిల్లో ఉన్నారు. స్థానిక క్రీడాకారులు ఎస్ ముత్తు, రెహమాన్ మెహబూబ్ షరీఫ్, ఔత్సాహికులు భరత్ కొల్లపూడి, జీ దుర్గాప్రసాద్ ఉన్నారు.